
# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 02 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm


# మేడ్చల్ పత్తి గోదాంలో అగ్నిప్రమాదం

## రూ. 50 కోట్ల నష్టం



హైదరాబాద్ : మేడ్చల్ పూడూరులోని సీసీఐ వారి కేంద్ర గోదాములో జరిగిన అగ్నిప్రమాదంలో 17 వేల పత్తి బేళ్స్ దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలిని పరిశీలించిన సీసీఐ సెంట్రల్ విజిలెన్స్ అధికారి, సీసీఐసీజీఎం, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 50 కోట్ల రూపాయల వరకు ఆర్థిక నష్టం జరిగినట్లు వివరించారు. బలమైన గాలులు వీచడంతో పత్తి బేళ్లు కాలి గోదాములు నేలమట్టమయ్యాయి.

# డబుల్ టంగ్ లీడర్ చాలా డేంజర్

### ఏడాది పాలనలో ఎన్నో మాటలు మార్చారు

### సీఎం రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

### మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

**హైదరాబాద్: మాట మార్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పీహెచ్డీ చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. డబుల్ టంగ్ లీడర్ చాలా డేంజర్ అన్నారు. తెలంగాణ భవన్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఏడాది పాలనలో ఎన్నో మాటలు మార్చారు. రెండు నాల్కల ధోరణి ప్రమాదం అని అన్నారు. సీఎం రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే అని దుయ్యబట్టారు.**

ప్రజలను ఏ రకంగా మోసం చేస్తున్నారు.. వంచిస్తున్నారు.. ఆయన నైజం ఏంటో ప్రజల ముందు నిజస్వరూపాన్ని బయట పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. రెండు తలల పామును చూసి భయపడుతాం. కానీ పాపం అది ఏం అనదు.. పెద్ద ప్రమాదకరం కాదు. రెండు నాల్కల ధోరణి కలిగిన మనషులు ఉంటారు. కానీ అలాంటి వారిని పెద్దగా పట్టించుకోం. కానీ అది చాలా ప్రమాదకరం. ఈ రెండు నాల్కల వైఖరి నిదర్శనం ఎవరంటే నిస్సందేహంగా రేవంత్ రెడ్డి అని చెప్తారు. డబుల్ ఎడ్జ్ నైఫ్‌తోనైనా జాగ్రత్తగా ఉండొచ్చు.. కానీ డబుల్ టంగ్ లీడర్లతో చాలా డేంజర్. సమాజానికి చాలా నష్టం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. డబుల్ స్టాండర్డ్స్ అంటే ఒక విషయంపై నిన్న, నేడు, రేపు ఒక మాట మాట్లాడడం. ఇందులో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారు. మాట మార్చడంలో, పూటకో మాట మాట్లాడడంలో రేవంత్ రెడ్డి దిట్ట. నేను ఆ మాట అనలేదు.. ఎవరు అన్నారంటూ ఉల్టా దబాయించి ముచ్చటగా మూడో మాట చెప్పగలిగిన నేర్పరితనం కూడా రేవంత్ రెడ్డిలో ఉంది. ఇవన్నీ రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీ అగ్ర నాయకులను రాక్షసులు అంటడు. మళ్లీ అదే పార్టీలో చేరి దేవతలు అంటడు. రాక్షసులు అన్న నోటితోనే దేవతలను పొగుడుతాడు. సిగ్గు, ఎగ్గు, సంకోచం, వ్యాకోచం ఏం లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడే తత్వం రేవంత్ రెడ్డిది అని హరీశ్‌రావు దుయ్యబట్టారు.



### 15 వేల కోట్లు ప్రజలు కట్టాలి?

గతంలో మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డే ఇప్పుడు ఒక పంటకు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రైతు బంధు, రైతుబీమా ద్వారా రైతులకు 82 వేల కోట్లు ఇచ్చింది కేసీఆర్ అని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక. రైతుబంధు, రైతుబీమా, బతుకమ్మ చీరలను ఎగొట్టారని ఆరోపించారు. గతంలో ఎల్ఆర్ఎస్ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి......ఇప్పుడు 15వేల కోట్లు ప్రజల నుంచి కట్టించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. పేదలపై సీఎంకు ప్రేమ ఉంటే ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు

# ఫుట్‌బాల్ ఫ్యాన్స్ మధ్య గొడవ

### 100 మందికిపైగా మృతి



ప్రపంచం : గినియాలో ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం జరిగిన ఘర్షణల్లో డజన్ల కొద్దీ ప్రజలు మరణించారు. పశ్చిమ ఆఫ్రికా దేశంలోని రెండవ అతిపెద్ద నగరమైన న్జెరెకోర్ నగరంలో లాబ్, న్జెరెకోర్ ఫుట్‌బాల్ జట్ల మధ్య జరిగిన ఆటలో హింస జరిగింది. ఆసుపత్రి ప్రతినిధులు వివరాల ప్రకారం సుమారు 100 మందికిపైనే మరణించినట్లు తెలుస్తోంది. ఈ హింసను గినియా ప్రధాన మంత్రి బహౌరీ ఆదివారం ఎక్స్ లో వేదికగా ఖండించారు. సాక్షుల ప్రకారం... ఇదంతా రిఫరీ వివాదాస్పద నిర్ణయంతో ప్రారంభమైంది, అప్పుడు అభిమానులు పిచ్‌పై దాడి చేశారని చెప్పారు. 2021లో జరిగిన తిరుగుబాటులో అధికారాన్ని చేజిక్కించుకుని, తనను తాను అధ్యక్షుడిగా నియమించుకున్న గినియా జుంటా నాయకుడు మామాడి డౌంబౌయా గౌరవార్థం ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో ఈ మ్యాచ్ భాగమని స్థానిక మీడియా తెలిపింది. డౌంబౌయా వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. "ఈ రోజు మధ్యాహ్నం న్జెరెకోర్‌లో లాబ్, న్జెరెకోర్ జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌ను దెబ్బ తీసిన సంఘటనలను ప్రభుత్వం విచారిస్తుంది," అని ఓరీ చెప్పారు.

# మీ గురువులకే చుక్కలు చూపిన కేసీఆర్


### ఆయన మొక్క కాదు.. వేగు చుక్క : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి కేసీఆర్ ఒక వేగుచుక్క అని అన్నారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని ప్రశంసించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోం. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

# సినిమాలకు బ్రేక్

ముంబై : 12TH ఫెయిల్ చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే సంచలన ప్రకటన చేశారు. కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా ఓ నోట్ పెట్టారు. కొన్నేళ్లుగా అందరి నుంచి



అసాధారమైన ప్రేమ, అభిమానాన్ని పొందుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ తనకు సహకారం అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఓ తండ్రిగా, కొడుకుగా, భర్తగా బాధ్యతలు నెరవేర్చాల్సిన టైం వచ్చిందన్నారు. అందుకే కొత్త సినిమాలను అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. 'గత కొన్నేళ్లు అద్భుతంగా గడిచాయి. ఇన్నాళ్లు నాపై ప్రేమ, అభిమానం చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇప్పుడు నా ఫ్యామిలీకి సమయం కేటాయించాల్సిన టైమ్ వచ్చింది. 2025లో రిలీజ్ అయ్యే సినిమానే నా చివరి మూవీ' అని విక్రాంత్ మాస్సే ప్రకటించారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయంతో అభిమానులతోపాటు సినీ ప్రియులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

# కోకాకోలా కంపెనీని ప్రారంభించిన సీఎం రేవంత్



బండతిమ్మాపూర్: సిద్ధిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ప్లాంట్‌లో కలియ తిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ఉన్నారు.

# అంబేడ్కర్ను అవమానిస్తున్నారు

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడేది మాలల్లో ఉండే కొందరు స్వార్థపరులు, మనువాదులే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. దళిత వర్గాల్లో ఎదిగిన మాలవర్గం అంబేడ్కర్ పోరాట స్ఫూర్తికి వ్యతిరేకంగా వెళుతున్నారని మండిపడ్డారు. మాలలు అంబేడ్కర్ వారసులు కాదని అంబేడ్కర్ ను అవమానిస్తున్నారని ఆరోపించారు. వివేక్ వెంకటస్వామికి ఎస్సీ వర్గీకరణకు అడ్డు తగిలే శక్తి ఉంటే..కాంగ్రెస్ కు రాజీనామా చేసి వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరాలని సూచించారు.

# సుప్రీంలో స్వల్ప అగ్ని ప్రమాదం



న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన సుప్రీంకోర్టు సెక్యూరిటీ, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటన నేపథ్యంలో 12వ నంబరు గదిలోని బెంచ్ నేటి విచారణలను నిలిపివేసింది. కోర్టు నంబరు 11, 12 మధ్య ఉన్న వెయిటింగ్ ఏరియాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి.

# రాంగోపాల్ వర్మకు ఊరట

అమరావతి : రాంగోపాల్ వర్మకు ఏపీలో హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆర్జీవీ దాఖలు చేసిన పిటిషన్లపై ఇవాళ విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం వరకు వరకు అరెస్ట్ చేయొద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. కోర్టు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన అంశంలో టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ పై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.

# బీజేపీ చార్జిషీట్ ఆశ్చర్యం

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ ఎడాది పాలనపై బీజేపీ పార్టీ ఛార్జ్ షీట్ విడుదల చేయడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 2 లక్షల వరకు రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. ప్రజల్లో వస్తున్నా ఆదరణ చూసి తట్టుకోలేక అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి చట్టబద్దత కల్పించాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు